క్లుప్తంగా

ఉచిత కంటి శిబిరం

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంట విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేస్తారని అధ్యక్షుడు కర్నం నర్సింలు ఒక ప్రకటనలో తెలిపారు. నేత్రాలయ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరంలో కంటి సమస్యలు ఉన్న వారు ఉచిత పరీక్షలు చేయించుకోవాలని నర్సింలు పేర్కొన్నారు.

వైభవంగా ముగిసిన ఉత్సవాలు



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

పెద్దశంకరంపేట(మెదక్): పేటలో భవానీమందిర్‌లో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. ఆదివారం ఆలయంలో ధర్మకర్తల ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాన్ని నిర్వహించారు. ఏటా పౌర్ణమి వరకు ఆలయంలో ఉత్సవాలను నిర్వహిస్తుంటారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య హోమం చేశారు. మహిళలు అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు ఆర్‌ఎన్‌. సంతోష్‌ కుమార్‌, ఆర్‌ఎన్‌.శ్రీనివాస్‌, శివకుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేయాలి

పెద్దశంకరంపేట(మెదక్): నారాయణఖేడ్‌లో సోమవారం నిర్వహించే ప్రజా ఆశీర్వాదసభను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్‌ మండలాధ్యక్షుడు మురళిపంతులు, ఎంపీపీ శ్రీనివాస్‌, జెడ్పీటీసీ విజయరామరాజు అన్నారు. ఆదివారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఖేడ్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభకు ముఖ్యమంత్రి కేసీఆర్‌ హాజరవుతారని, మండలం నుంచి అధిక సంఖ్యలో అభిమానులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

కాంగ్రెస్‌ పార్టీ గ్రామ కమిటీల ఏర్పాటు



నియామక పత్రం అందిస్తున్న నవీన్‌

చేగుంట(తూప్రాన్): దుబ్బాక కాంగ్రెస్‌ అభ్యర్థిగా చెరుకు శ్రీనివాస్‌రెడ్డిని ప్రకటించడంతో పార్టీ కార్యక్రమాలను ముమ్మరం చేశారు. ఆదివారం మండల శాఖ అధ్యక్షుడు నవీన్‌ ఆధ్వర్యంలో కరీంనగర్‌ గ్రామంలో గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మాలోత్‌ విఠల్‌, ఉపాధ్యక్షుడిగా గంధం రాజు, ప్రధాన కార్యదర్శిగా బాలచంద్రంను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో తాయబ్‌, శంకర్‌, ఎల్లం, యాదగిరి, శ్యామల, ఘోరీ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ హయాంలో తండాల అభివృద్ధి



మాట్లాడుతున్న బిల్‌ నాయక్‌

పాపన్నపేట(మెదక్): బీఆర్‌ఎస్‌ అధికారంలోనే గిరిజన తండాలు అభివృద్ధి చెందాయని హుస్నాబాద్‌ మాజీ జెడ్పీటీసీ బిల్‌ నాయక్‌ అన్నారు. ఆదివారం ఆయన బీఆర్‌ఎస్‌ నాయకులతో కలసి మండల పరిధిలోని అమ్రియా తండా, సోమ్లా తండా, దాక్యాతండా, నర్సింగరావుపల్లి తండాల్లో పర్యటించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఒకప్పుడు తండాల్లో నీళ్లు లేక కిలోమీటర్ల కొద్ది నడిచి నీళ్లు తెచ్చుకునే వారన్నారు. ఇప్పుడు ప్రతీ తండాలో సీసీరోడ్లు, 24 గంటల కరెంట్‌, పుష్కలంగా నీరు లభిస్తుందన్నారు. ఈ సారి ఎన్నికల్లో పద్మాదేవేందర్‌ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌ రెడ్డి, లంబాడి హక్కుల పోరాట సమితి నాయకులు సత్యం, వెంకటేశం, వెంకట్‌రాములు, తిరుపతిరెడ్డి, లక్ష్మాగౌడ్‌ ఉన్నారు.

బీజేపీలో చేరికలు

జగదేవ్‌పూర్‌(గజ్వేల్‌): మండల మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు కొట్టాల మల్లేశం ఆదివారం బీజేపీ గజ్వేల్‌ అభ్యర్థి ఈటల రాజేందర్‌ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈసందర్భంగా మల్లేశం మాట్లాడుతూ.. గజ్వేల్‌లో రాజేందర్‌ గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు సింగం సత్తయ్య, బీజేవైఎం మండలాధ్యక్షుడు శ్రీధర్‌, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడవచ్చు

- సీఐ శ్రీధర్‌
- పోలీసుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న ఎస్‌ఐ శివానందం

తూప్రాన్‌: రక్తదానంతో ప్రాణాలను కాపాడవచ్చునని తూప్రాన్‌ సీఐ శ్రీధర్‌ పేర్కొన్నారు. పోలీస్‌ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పోలీస్‌ స్టేషన్‌ ఆవరణలో జిల్లా పోలీస్‌ శాఖ ఆదేశాల మేరకు రెడ్‌క్రాస్‌ సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని యువత, యావపూర్‌, పడాల్‌పల్లి తదితర గ్రామాలకు చెందిన యువత పెద్ద సంఖ్యలో హాజరై పోలీసులతో పాటు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. అన్ని దానాల్లో రక్తదానం గొప్పదన్నారు. ప్రతీ ఒక్కరు ప్రతీ మూడు నెలలకు రక్తదానం చేయవచ్చునన్నారు. ఇందుకు యువత స్ఫూర్తితో ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీధర్‌, ఎస్‌ఐ శివానందం, మనోహరాబాద్‌ ఎస్‌ఐ కరుణాకర్‌ రెడ్డి, పోలీస్‌ సిబ్బంది, యువతతో పాటు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు ప్రజలు బ్రహ్మరథం



కూరగాయలు విక్రయిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్‌ హేమలత

మనోహరాబాద్‌(తూప్రాన్‌): బీఆర్‌ఎస్‌ పార్టీకి ప్రజలు మూడోసారి సైతం బ్రహ్మరథం పట్టనున్నారని జెడ్పీ చైర్‌పర్సన్‌ హేమలత, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్‌ మాజీ చైర్మన్‌ భూపతిరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని చెట్లగౌరారం, జీడిపల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బీఆర్‌ఎస్‌ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో తూప్రాన్‌ పీఏసీఎస్‌ చైర్మన్‌ బాలకృష్ణారెడ్డి, వైస్‌ ఎంపీపీ విఠల్‌రెడ్డి, సర్పంచ్‌లు మహిపాల్‌రెడ్డి, రేఖమల్లేశ్‌, ఎంపీటీసీ స్వర్ణలత, నాయకులు పెంటాగౌడ్‌, మల్లేశ్‌, వెంకటరమణ, భిక్షపతి, వెంకటేష్‌ పాల్గొన్నారు.

మున్నూరు కాపులు ఐక్యంగా ఉండాలి



మెదక్‌కు తరలివెళ్తున్న మున్నూరు కాపు నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్‌): మున్నూరు కాపులు ఐక్యంగా, సంఘటితంగా ఉన్నప్పుడే రాజకీయంగా ఇతర అంశాల్లో ప్రాధాన్యత లభిస్తుందని రాష్ట్ర మున్నూరు కాపు సంఘం ఉపాధ్యక్షుడు హనుమంతరావు అన్నారు. మెదక్‌లో తలపెట్టిన మున్నూరు కాపు ఆత్మీయ మహాసభకు ఆదివారం మండలం నుంచి ఆ సంఘం కులస్తులు భారీగా తరలివెళ్లారు. హనుమంతరావు ఆధ్వర్యంలో మండల కేంద్రం శివ్వంపేటతో పాటు పలు గ్రామాల నుంచి వివిధ వాహనాల్లో మెదక్‌ తరలివెళ్లారు.

కాంగ్రెస్‌ కార్నర్‌ మీటింగ్‌కు 3 వేల మంది



ర్యాలీగా వెళ్తున్న కాంగ్రెస్‌ కార్యకర్తలు

పాపన్నపేట(మెదక్‌): మెదక్‌లో ఆదివారం జరిగిన కాంగ్రెస్‌ కార్నర్‌ మీటింగ్‌కు పాపన్నపేట మండలం నుంచి సుమారు 3 వేల మంది కార్యకర్తలు తరలి వెళ్లారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ ఖర్గే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాజరవుతున్న ఈ సభకు, జిల్లా కాంగ్రెస్‌ రైతు సంఘం అధ్యక్షుడు ప్రభాకర్‌ రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, మండల కాంగ్రెస్‌ అధ్యక్షుడు గోవింద్‌ నాయకత్వంలో కాంగ్రెస్‌ కార్యకర్తలు భారీగా బైక్‌ ర్యాలీగా వెళ్లారు.

బీజేపీ వైపు మొగ్గు చూపుతున్న ప్రజలు



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మనోహరాబాద్‌(తూప్రాన్‌): ప్రజలు బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారని మెదక్‌ పార్లమెంట్‌ బీజేపీ కన్వీనర్‌ రామ్మోహన్‌గౌడ్‌ అన్నారు. ఆదివారం మండలంలోని జీడిపల్లిలో బీజేపీ మండలాధ్యక్షుడు కమ్మరి నరేందర్‌చారి ఆధ్వర్యంలో మండల ముఖ్య నాయకులతో ఆత్మీయ సమ్మేళనం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్‌ మాయమాటలు నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. ఈ కార్యక్రమంలో మండల సమన్వయ కర్త రామిడి వెంకట్‌రెడ్డి, నాయకులు జగన్‌గౌడ్‌, సాయి, మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్‌గౌడ్‌, జిల్లా యువమోర్చా నాయకులు అజయ్‌, కిరణ్‌కుమార్‌, మనోహర్‌రెడ్డి, లింగం, రాజు, నరేశ్‌, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెడికల్‌ క్యాంప్‌



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మనోహరాబాద్‌(తూప్రాన్‌): తన తండ్రి జ్ఞాపకార్థం గ్రామస్తులకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం మండల కేంద్రానికి చెందిన ఇమాంపురం వెంకటేశం కుమారుడు హరీశ్‌గౌడ్‌ హైదరాబాద్‌కు చెందిన రిమ్స్‌ అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌, జనరల్‌ సర్జన్‌ పాండురంగంగౌడ్‌తో కలిసి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు నరాల బలహీనత, షుగర్‌, పిల్లలకు, గైనాకాలజీ తదితర వాటికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అంతకు ముందు ఉచిత వైద్య శిబిరాన్ని తూప్రాన్‌ సీఐ శ్రీధర్‌, సర్పంచ్‌ మహిపాల్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయండి

శివ్వంపేట(నర్సాపూర్‌): తూప్రాన్‌ – నర్సాపూర్‌ ప్రధాన హైవేపై చేస్తున్న పనులకు సంబంధించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. తూప్రాన్‌ – నర్సాపూర్‌ హైవే శివ్వంపేట ప్రధాన రహదారి డివైడర్‌ మధ్యలో బటర్‌ఫ్లై లైట్ల ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయి. లైట్ల ఏర్పాటుకు తవ్వకాలు చేపట్టిన సంబంధిత సిబ్బంది సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో రాత్రివేళలో రోడ్డుపై పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు వాపోయారు. ఈ విషయమై హైవే రామకృష్ణ దృష్టికి తీసుకెళ్లగా.. రోడ్డుపై పనులు జరుగుతున్న ప్రదేశంలో సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

ఎన్నికల ప్రచారంలో గొడవ

రామాయంపేట(మెదక్‌): నార్సింగి మండలంలోని జప్తిశివునూర్‌ గ్రామంలో ఆదివారం ప్రచారానికి వెళ్లిన మెదక్‌ బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి అనుచరుడిపై దాడి చేశారు. కాశతండాకు చెందిన చాంద్‌పాషా, అతని ఇద్దరి కుమారులు కలిసి ప్రచారానికి వెళ్లిన తనపై దాడికి పాల్పడ్డారని చిన్నశంకరంపేటకు చెందిన కుమార్‌గౌడ్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ అహ్మద్‌ మోహినుద్దీన్‌ తెలిపారు.

నేడు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కౌడిపల్లి(నర్సాపూర్‌): మండలంలోని వివిధ గ్రామాల్లో ఈనెల 30న వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు పీఏసీఎస్‌ సీఈఓ దుర్గాగౌడ్‌ తెలిపారు. సొసైటీ పరిధిలోని 15 గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని చెప్పారు.

చెరువులో మునిగి యువకుడి మృతి



చంద్రశేఖర్‌(ఫైల్‌)

నర్సాపూర్‌రూరల్‌: చెరువులో స్నానానికి వెళ్లిన వ్యక్తి నీట మునిగి మృతి చెందిన సంఘటన మండలంలోని అవంచ గ్రామంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. మృతుని తల్లి, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అవంచ గ్రామానికి చెందిన కొండి లక్ష్మి – వీరయ్య దంపతులకు ముగ్గురు కూతుళ్లు, ఒక కొడుకు చంద్రశేఖర్‌ ఉన్నారు. కాగా చంద్రశేఖర్‌ ఈనెల 28న సాయంత్రం గ్రామ శివారులోని పెద్ద చెరువులో స్నానం చేసి వస్తానని తల్లికి చెప్పి వెళ్లిన వ్యక్తి రాత్రి అయినా.. ఇంటికి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన తల్లి ఇంటి పొరుగువారితో కలిసి చెరువు వద్దకు వెళ్లి చూడగా అక్కడ చంద్రశేఖర్‌ దుస్తులు కనిపించాయి. కానీ అతడు కనిపించలేదు. రాత్రి కావడంతో తిరిగి ఈనెల 29న ఉదయం స్థానికులతో కలిసి చెరువులో గాలించగా చంద్రశేఖర్‌ శవం లభ్యమైంది. ఈ విషయం తెలుసుకున్న నర్సాపూర్‌ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారించారు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి బలవన్మరణం

తూప్రాన్‌: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని యావపూర్‌ గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్వామి(49) అనే వ్యక్తి కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలో ఇంటి వెనకాల శనివారం రాత్రి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రెండు స్థానాల్లో బీఎస్పీ పోటీ

నర్సాపూర్‌: జిల్లాలో ఉన్న మెదక్‌, నర్సాపూర్‌ అసెంబ్లీ స్థానాల్లో బీఎస్పీ అభ్యర్థులు పోటీ చేస్తారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కుతాడి నర్సింలు చెప్పారు. పార్టీ ముఖ్య నాయకులతో నర్సాపూర్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాల్లోని రెండు స్థానాల్లో పోటీ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. పోటీలో ఉండే అభ్యర్థులను తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌ నిర్ణయిస్తారని నర్సింలు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరికలు

పాపన్నపేట(మెదక్‌): మండల కేంద్రం పాపన్నపేట ఎంపీపీ చందన, బీఆర్‌ఎస్‌ మాజీ మండలాధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి ఆదివారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. మెదక్‌లో జరిగిన కాంగ్రెస్‌ కార్నర్‌ మీటింగ్‌లో వీరికి కాంగ్రెస్‌ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు, మెదక్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ అభ్యర్థి మైనంపల్లి రోహిత్‌ ఉన్నారు.



రేవంత్‌రెడ్డితో ఎంపీపీ చందన, ప్రశాంత్‌రెడ్డి

రాజిరెడ్డిపై దుష్ప్రచారం తగదు



మాట్లాడుతున్న మల్లేశం గౌడ్‌

కౌల్దారం(నర్సాపూర్‌): నర్సాపూర్‌ నియోజకవర్గంలో నాలుగున్నర ఏళ్లుగా కాంగ్రెస్‌ పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసి, ప్రజలతో మెప్పు పొందిన ఆవుల రాజిరెడ్డిపై సొంత పార్టీ నేతలు దుష్ప్రచారం చేయడం తగదని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశంగౌడ్‌ అన్నారు. ఆదివారం మెదక్‌ పట్టణంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ ఖర్గే నిర్వహించే బస్సు యాత్రకు తరలి వెళ్లేందుకు ముందు పోతంశెట్టిపల్లి చౌరస్తాలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ అధిష్టానం రాజిరెడ్డి చేసిన కృషికి గుర్తింపుగానే నర్సాపూర్‌ ఎమ్మెల్యే టికెట్‌ను ఇచ్చిందన్నారు. కానీ కొందరు సొంత పార్టీ నేతలే గాంధీభవన్‌ వద్దకు వెళ్లి రాజిరెడ్డి బీఆర్‌ఎస్‌ అభ్యర్థి కోవర్టు అంటూ అసత్య ప్రచారం సరికాదన్నారు. నియోజకవర్గ ప్రజలు నర్సాపూర్‌ ఎమ్మెల్యే అభ్యర్థిగా రాజిరెడ్డిని కోరుకుంటున్నారని, ఆ మేరకే అధిష్టానం సర్వేలు నిర్వహించి టికెట్‌ కేటాయించిదన్నారు. ఇప్పటికైనా పార్టీ నిర్ణయం మేరకు రాజిరెడ్డి అభ్యర్థిత్వాన్ని అందరూ శిరసావహిస్తూ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల పార్టీ ఉపాధ్యక్షుడు గోవర్దన్‌, ప్రధాన కార్యదర్శి మహేశ్వర్‌రెడ్డి, నర్సాపూర్‌ అసెంబ్లీ యువజన అధ్యక్షుడు రియాజ్‌ అలీ, మాదాపూర్‌ గ్రామ అధ్యక్షుడు అంజగౌడ్‌, సంగాయిపేట మాజీ సర్పంచ్‌ బాద్య నాయక్‌, బీసీ సెల్‌ మండల నాయకులు అగం గౌడ్‌, రవీందర్‌గౌడ్‌, మల్లేశం, సయ్యద్‌ అక్రం, జనార్దన్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, కిష్టయ్య, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

రాజిరెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం

- కాంగ్రెస్‌ మండలాధ్యక్షుడు శ్రీనివాసరావు



మాట్లాడుతున్న కాంగ్రెస్‌ నాయకులు

కౌడిపల్లి(నర్సాపూర్‌): కాంగ్రెస్‌ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసిన ఆవుల రాజిరెడ్డి గెలుపు గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని కాంగ్రెస్‌ మండలాధ్యక్షుడు శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం కౌడిపల్లిలోని కాంగ్రెస్‌ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ పార్టీలో మంత్రి పదవి దక్కించుకున్న సునీతారెడ్డి స్వార్థం కోసం పార్టీని వీడిందన్నారు. అప్పటి నుంచి నియోజకవర్గంలో కష్టాల్లో ఉన్న పార్టీ అభివృద్ధికి రాజిరెడ్డి కృషి చేశారని చెప్పారు. పార్టీలో విభేదాలు పక్కన పెట్టి అతన్ని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. బీఆర్‌ఎస్‌ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. రైతులకు రుణమాఫీ చేయకపోవడంతో వడ్డీ డబుల్‌ అయిందన్నారు. డబుల్‌బెడ్రూం ఇవ్వలేదని, బీఆర్‌ఎస్‌కు మాయమాటలను ప్రజలు నమ్మరని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు పాషా, శ్రీనివాస్‌గౌడ్‌, భైరవస్వామి, రఘు, శేఖర్‌, సత్యనారాయణ, సుధాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు



కండువా కప్పుతున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్‌): మండలంలోని గజగట్లపల్లి గ్రామ ఉపసర్పంచ్‌ బండారు యాదగిరి సొంతగూటికి చేరుకున్నారు. ఆదివారం మెదక్‌ బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి సమక్షంలో తిరిగి బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ మండలాధ్యక్షుడు పట్లోరి రాజు, సర్పంచ్‌ మీనారవీందర్‌, ఎంపీటీసీ ప్రసాద్‌గౌడ్‌, టీఆర్‌ఎస్‌వీ నియోజవర్గ నాయకులు లింగంరాజ్‌, సురేశ్‌గౌడ్‌ ఉన్నారు. అనంతరం మండలంలోని సూరారం గ్రామంలో బీఆర్‌ఎస్‌ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించి, కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌ నీరజగౌడ్‌, ఎంపీటీసీ అనురాధ, బీఆర్‌ఎస్‌ నాయకులు నాగరాజు, మండల అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

శంఖారావ సభకు తరలిన బీఆర్‌ఎస్‌ నాయకులు



నర్సాపూర్‌ సభకు వెళ్తున్న అజ్జమర్రి సర్పంచ్‌, గ్రామస్తులు

కౌల్దారం(నర్సాపూర్‌): పట్టణంలో ఆదివారం బీఆర్‌ఎస్‌ పార్టీ నిర్వహించిన ఎన్నికల శంఖారావానికి మండలం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. వై.మాంతపూర్‌ నుంచి సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు విష్ణువర్దన్‌రెడ్డి, రంగంపేట నుంచి డీసీఎంఎస్‌ వైస్‌ చైర్మన్‌ రమేశ్‌, సంగంపెట్టిన మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, కోనాపూర్‌ నుంచి ఆ పార్టీ మండల యువజన అధ్యక్షుడు సంతోష్‌రావు, పైతల నుంచి యువజన నాయకుడు రవితేజ రెడ్డి, ఎనగండ్ల నుంచి సర్పంచ్‌ వీరారెడ్డి, వరిగుంతం నుంచి జెడ్పీటీసీ మేఘమాల ఆధ్వర్యంలో తరలివెళ్లారు.

వెల్దుర్తి(తూప్రాన్‌): నర్సాపూర్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్‌ ఎన్నికల శంఖారావం సమావేశానికి ఉమ్మడి వెల్దుర్తి మండలంలోని పలు గ్రామాల నుంచి ఆ పార్టీ నాయకులు భారీగా తరలివెళ్లారు. జెడ్పీటీసీ రమేశ్‌గౌడ్‌, ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, బీఆర్‌ఎస్‌ నాయకులు ఉన్నారు.

చిలప్‌చెడ్‌(నర్సాపూర్‌): మండల బీఆర్‌ఎస్‌ నాయకులు, కార్యకర్తలు సభకు భారీగా తరలివెళ్లారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



తునికి నల్లపోచమ్మకు బోనాలు తీస్తున్న భక్తులు

చిలప్‌చెడ్‌(నర్సాపూర్‌): మండల పరిధిలోని చిట్కుల్‌ శివారులో మంజీరా తీరంలో వెలసిన చాముండేశ్వరి అమ్మవారిని ఆదివారం భక్తులు దర్శించుకున్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేసి భక్తులకు తీర్థ, ప్రసాదాల వితరణ చేశారు.

కౌడిపల్లి(నర్సాపూర్‌): మండలంలోని తునికి నల్ల పోచమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్‌ గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శివప్ప, రాజేశ్‌ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారి వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మినీ బస్సు బోల్తా..

12 మందికి గాయాలు



బోల్తా పడ్డ మినీ బస్సు

కౌడిపల్లి(నర్సాపూర్‌): దైవ దర్శనం కోసం వెళ్తుండగా మినీ బస్‌ బోల్తా పడటంతో 12 మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని ధర్మాసాగర్‌గేట్‌ సమీపంలో 765డీ జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌ నల్లకుంటకు చెందిన వ్యక్తి కుటుంబ సభ్యులు బంధువులతో కలిసి మినీ ట్రావెల్‌బస్‌లో దైవదర్శనానికి ఏడుపాయల వనదుర్గాదేవి ఆలయానికి వస్తున్నారు. కాగా ధర్మాసాగర్‌గేట్‌ సమీపంలోకి రాగానే బస్సు అదుపుతప్పి విద్యుత్‌ స్తంభాన్ని ఢీకొని బోల్తా పడింది. దీంతో స్తంభం విరిగిపోయి వైర్లు తెగిపోయాయి. విద్యుత్‌ సరఫరా నిలిచిపోవడంతో ప్రమాదం తప్పింది. కాగా బస్‌లో ప్రయాణిస్తున్న 12 మందికి స్వల్ప గాయాలు కాగా బాధితులను 108లో నర్సాపూర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ సమాచారం కోసం పోలీసులకు అడగ్గా.. ఎలాంటి ఫిర్యాదు రాలేదని చెప్పారు.